
చంద్రుని కూతురూ, సూర్యుని కొడుకూ

చంద్రుని కూతురూ, సూర్యుని కొడుకూ

ఉత్తర జాతుల జానపద కథ

పగలంతా సూర్యుడు తేలిక మంచుబండిలో కూర్చొని నీలాకాశంలో పోతాడు, తన దేశాలను తనిఖీ చేసుకుంటూ. ఉదయం అతని బండిని యెలుగుబంటి లాగుతుంది, మధ్యాహ్నం పోతు దుప్పి లాగుతుంది, సాయంత్రం పెంటి దుప్పి లాగుతుంది. సూర్యునికి లెక్కలేనన్ని పను లున్నాయి: పుట్టబోయేవాటి కన్నిటికీ ప్రాణం పోయాలి, చెట్లనూ, మొక్కలనూ, గడ్డినీ పెంచాలి, జంతువులకూ, మనుషులకూ, పక్షులకూ వెలుతురు యివ్వాలి; అలా చేస్తేనే అవన్నీ బాగా బలిసి, సంతానం కని, సూర్యుని ఐశ్వర్యాన్ని వృద్ధిచేస్తాయి.

సాయంత్రం అయ్యేటప్పటికి సూర్యుడు శక్తి తగ్గి, సముద్రంలో పడిపోతాడు. అప్పుడతను నిద్రపోయి, విశ్రాంతి తీసుకుంటే బాగుంటుంది. కానీ కొడుకు పెయ్‌వాల్కె వచ్చి అతనితో వాదం పెట్టుకుంటాడు:

"నాన్నా, నాకు నిజంగా పెండ్లి చేసుకునే యీడు వచ్చింది!"

"నిజమే, నీకు పెండ్లీడు వచ్చింది. మరి, పెండ్లికూతురు వుందా?"


"లేదు. నా బంగారు బూట్లు అందరికీ తొడిగి చూసినాను. యెవరికీ సరిపడలేదు. వాళ్లందరికీ పాదాలు బరువు, భూమిమీదనుండి వాటిని యెత్తలేరు. మరి నేనేమో ఆకాశంలో విహరించాలి."


"నీవు వెదకవలసిన చోట వెదకడం లేదు," అన్నాడు సూర్యుడు. "నేను చంద్రుని అడుగుతానుండు. అతనికి కూతురు పుట్టిందని విన్నాను. చంద్రుడు మనకంటె బీదవాడే ననుకో; అయినా, అతను మనలాగే ఆకాశంలో విహరించేవాడు."


చంద్రుడు ప్రొద్దున పూట ఆకాశంలోకి వచ్చే రోజుదాకా సూర్యుడు ఆగి, ఆ రోజు చంద్రుని సమీపించి, యిలా అన్నాడు:

"నీ కొక అందమైన కూతురు వుందట కదూ? నీ కూతురుకు నాదగ్గర పెండ్లికొడుకు వున్నాడు, నా కొడుకు పెయ్‌వాల్కె."

చంద్రుని ముఖం నల్లబడింది. అతనన్నాడు: "నా కూతురు యింకా పసిపిల్ల. చేతులలో యెత్తుకుంటే, చేతులలో వున్నట్లే వుండదు. పిల్ల కొద్దిగా మాత్రమే వెలుగుతున్నది. యిప్పుడే పెండ్లేమిటి?"







"దాని కేంతే," అన్నాడు సూర్యుడు. "నాకు ఐశ్వర్యం వుంది. మేము బాగా తిండిపెట్టుతాం, పిల్ల బలుస్తుంది. నా కొడుకు పిల్లనొకసారి చూడనీ."

చంద్రుడు భయంతో "వద్దు!" అంటూ, కూతురుకు మేఘాన్ని కప్పినాడు. "నీ కొడుకు నా కూతురును మాడ్చేస్తాడు. నిజం చెప్తాను విను. నా కూతురుకు యిప్పటికే పెండ్లికొడుకు వున్నాడు, నైనస్ ఉత్తర కాంతి. అదుగో అక్కడ సముద్రంపైన విహరించేవాడు."


"అలాగా!" అంటూ సూర్యుడు మండిపడినాడు. "చిన్న వెలుగు ముక్క కోసం నా మాట కాదంటావా? నీవు మరచిపోయినట్లుంది — నేనే అన్నిటికీ ప్రాణం పోసేది, నాకు ఐశ్వర్యం వుంది, శక్తి వుంది."

"నీ కున్నది సగం శక్తే," అన్నాడు చంద్రుడు. "నీవు సంజ వేళ యెక్కడున్నావ్? రాత్రి పూట యెక్కడున్నావ్? చలి కాలమంతా నీ శక్తి యెక్కడుంది? మరి, నైనస్ ఉత్తర కాంతి చలికాలమూ, రాత్రి పూటా వెలుగునిస్తాడు."



యీ మాటలతో సూర్యునికి యింకా ఆగ్రహం పెరిగి, మంటలు గక్కినాడు. కోపంతో కుతకుతలాడుతూ అతను అరచినాడు: ''యేమైనా సరే, నీ కూతురును నా కొడుక్కు పెండ్లిచేస్తాను!''
తుఫాను చెలరేగింది, ఝంఝానిలం ఘీంకరించింది, సముద్రాలు ఉప్పొంగినాయి, పర్వతాలు కంపించినాయి, భూమిమీద ప్రాణు లన్నీ తల్లడిల్లినాయి, దుప్పులు భయంతో ఒకచోట చేరి ముడుక్కున్నాయి, మనుషులు గుడారాలలో దాక్కున్నారు.
చంద్రుడు వేగంగా రాత్రి చీకటిలోకి పోయినాడు. ''పిల్లను సూర్యుని కండ్ల బడకుండా దాచిపెట్టాలి,'' అని అతను అనుకున్నాడు. ఒక సరస్సు మధ్యలో చిన్న దీవిలో నివసించే ముసలి దంపతులు అతనికి కనిపించినారు. వాళ్ళు చాలా మంచివాళ్ళు. ''నా కూతురును వాళ్లకు అప్పగిస్తాను!'' అనుకున్నాడు అతను.
సూర్యుడు కోపంతో మండి మండి అలసిపోయినాడు.
తుఫాను వెలిసింది, గాలి అణగింది.
ముసలివాడూ, అతని భార్యా చెట్ల తాట తెచ్చుకోడానికి అడవిలోకి పోయినారు. అదేమిటి!







ఫర్ చెట్టు కొమ్మకు వెండి ఊయెల వ్రేలాడుతున్నది. అందులో యెవరూ లేనట్లుంది. కానీ పసిపిల్ల గొంతు వినపడుతున్నది:

''నియేకియ — నేను లేను. మరి యిక్కడున్నాను!''

వాళ్లు చూసినారు. ఊయెలలో పసిపిల్ల వుంది, మనిషి జాతి పిల్ల లాగుంది. కానీ వెన్నెలలో వెలుగుతున్నది.

ముసలి దంపతులు ఊయెలను యింటికి తీసుకపోయినారు. తమ కిప్పుడు కూతురు వుందని వాళ్లకు ఆనందమైంది. వాళ్లు ఆమెను పెంచసాగినారు. వాళ్లను ఆమె తల్లిదండ్రుల లాగా చూస్తూవుండింది. రాత్రి పూట ఆమె గుడారంలోనుండి బయటికి పోయి, ముఖమూ, చేతులూ చంద్రునివైపు యెత్తి మరింత కాంతిగా ప్రకాశించేది. దుప్పి చర్మాలతో ఆమె చిత్తులు కుట్టడం నేర్చుకుంది, వాటిమీద వెండి జరీతోనూ, గాజు పూసలతోనూ బుటాపని చేయడం నేర్చుకుంది. ఆమె ఆట్లాడుకునే టప్పుడు ''నియేకియ — నేను లేను. మరి యిక్క









దున్నాను!'' అని కేకలు వేస్తూ, కనిపించకుండా మాయమయ్యేది. గలగల నవ్వు మాత్రం వినిపించేది. అందువలన ముసలివాళ్లు ఆమెను నియేకియ అని పిలిచేవాళ్లు.

నియేకియ పెరిగి పెద్దదై, యువతి అయింది. ఆమె గుండ్రని ముఖంతో, యెర్రని బుగ్గలతో, వెండి దారాలలాంటి జుట్టుతో, మనిషంతా వెలుగుతున్నట్లు వుండింది. భూలోకపు పిల్లలాగ లేని పెండ్లికూతురు ఆ దీవిలో వున్నట్లు సూర్యునికి వార్త తెలిసింది. అతను తన కొడుకు పెయ్‌వాల్కెను పంపినాడు, తెలుసుకొని రమ్మని. పెయ్‌వాల్కె ఆ దీవిలోని ముసలి దంపతుల గుడిసెకు పోయి, నియేకియను చూసినాడు. వెంటనే ఆమె అతనికి నచ్చింది.


“సుందరీ, నా బంగారు బూట్లు తొడుక్కొని చూడు,'' అన్నాడు పెయ్‌వాల్కె. నియేకియ సిగ్గుపడుతూ, బూట్లలో కాళ్లు పెట్టి, “అబ్బా, నొప్పి!'' అన్నది.



“పరవా లేదులే, అలవాటు
పడతావు!” అన్నాడు పెయ్‌వాల్కె.
అతను ఆమెను కౌగలించుకొని,
యెత్తుకపోవాలని అనుకున్నాడు.
కానీ ఆమె “నేను లేను,
నేను లేను,”
అని అరుస్తూ, మాయమైంది.
బంగారు బూట్లు వాకిలి
గడపవద్ద పడివుండినాయి.
రాత్రి అయిందాకా నియేకియ
వనంలో దాక్కుంది. చంద్రుడు
ఆకాశంలోకి వచ్చినప్పుడు ఆమె
వెన్నెల పడిన బాటవెంట
నడిచి నడిచి, అడవులూ,
కొండలూ గడచింది. తండ్రి
చంద్రుడు ఆమెను నిర్జనమైన
సముద్రపు ఒడ్డున వున్న
యింటివద్దకు తీసుకపోయినాడు.
నియేకియ యింట్లోకి పోయింది.
అక్కడ యెవరూ లేరు. యిల్లు
చిందరవందరగా, అపరిశుభ్రంగా
వుండింది. నియేకియ నీళ్లు తెచ్చి,
యిల్లంతా వూడ్చి, శుభ్రం చేసింది.
ఆమెకు నిద్రపోవా లనిపించింది.









ఆమె కదురుగా మారి, గోడలోని ఒక రంధ్రంలో దూరి, నిద్రపోయింది. సంజె చీకటిలో నియేకియకు బరువైన అడుగుల చప్పుడు వినిపించింది. వెండి సైనిక దుస్తులు ధరించిన వీరులు యింట్లోకి వచ్చినారు. వాళ్లు ఒకరికంటె ఒకరు అందంగా, బలంగా వుండినారు. వాళ్లు ఉత్తర కాంతులు అనే అన్నదమ్ములు. నైనస్ ఉత్తర కాంతి అందరికంటె పెద్దవాడు, అందరికీ నాయకుడు.


"మన యిల్లు యెంత శుభ్రంగా వుంది!" అన్నాడు నైనస్. "యెవరో మంచి యిల్లాలు మన యింటికి వచ్చినట్లుంది. ఆమె యెక్కడ దాక్కున్నదో కనిపించడం లేదు. కానీ ఆమె మనల్ని చూస్తున్నదని నాకు అనిపిస్తున్నది." అన్నదమ్ములు భోజనానికి కూర్చున్నారు. భోం చేసిన తర్వాత వాళ్లు ఆడుకోవడం మొదలుపెట్టి, ఖడ్గాలతో యుద్ధం చేసినారు.


F.O.





ఖడ్గాలు గాలిలో తళతళ మెరిసినాయి, ఆకాశంలో యెర్రని మంటలు నాట్యం చేసినాయి. అన్నదమ్ములు యుద్ధ గీతం పాడుతూ, ఒకరి తర్వాత ఒకరు ఆకాశంలోకి యెగిరిపోయినారు. నైనస్ మాత్రం వెలుగుతున్న నీడలాగ యింట్లో మిగిలినాడు. అతను అడిగినాడు: ''నీ వెవరో కనిపించు! నీవు ముసలిదానివైతే, నాకు అమ్మ వౌతావు, నా యీడుదానివైతే, నా సోదరి వౌతావు, నీవు పడుచుదానివైతే, పెండ్లికూతు రంటాను.'' ''యిదుగో నేను,'' అంటూ నియేకియ మెల్లగా పలికి, ఉదయపు మసక వెలుతురులో నైనస్‌కు కనిపించింది. అతను ఆమెను అడిగినాడు: ''నన్ను పెండ్లాడుతావా, నియేకియా?'' ''పెండ్లాడుతాను,'' అన్నది నియేకియ. కానీ అంతలో సూర్యోదయం అయింది, సగం సూర్యుడు అప్పటికే ఆకాశంలోకి వచ్చినాడు. ''నాకోసం ఆగు, నియేకియా,'' అని నైనస్ కేకవేసి, ఆకాశంలోకి దూసుకొని పోయినాడు. ప్రతి సాయంత్రం నైనసూ, అతని తమ్ముళ్లూ తమ సొంత యింటికి వచ్చేవాళ్లు. ప్రతి సాయంత్రం వాళ్లు ఆకాశంలో ఆడుకునేవాళ్లు. కానీ తెల్లవారుతూనే వెళ్లిపోయేవాళ్లు. నియేకియ నైనస్‌ను అడిగేది: ''ఆగు నైనస్. ఒక్క రోజు నాతో కలిసి వుండు.''











''ఆగలేను,'' అని నైనస్ జవాబు చెప్పేవాడు.


''సముద్రం ఆవల నేను ఆకాశంలో యుద్ధాలు చేయాలి.'' నైనస్‌ను యింటివద్ద ఆపడం యెలాగా అని నియేకియ ఆలోచించింది. ఆమె దుప్పి చర్మాలతో ఒక తెర కుట్టి, దానిమీద వెండి దారాలతో పెద్ద నక్షత్రాలూ, చిన్న నక్షత్రాలూ కుట్టింది. ఆ తెరను ఆమె గోడకు పై భాగంలో తగిలించింది.

రాత్రికి నైనసూ, అతని వీరులూ తిరిగి వచ్చినారు. ఆకాశంలో ఆడుకున్న తర్వాత వాళ్లు పండుకున్నారు. నైనస్‌కు గాఢంగా నిద్రపట్టింది. కానీ, అప్పుడప్పుడు అతను కండ్లు తెరచి చూసేవాడు. అతనికి పైన నల్లని ఆకాశమూ, నక్షత్రాలూ కనిపించేవి. యింకా తెల్లవారలేదని అతను మళ్లీ నిద్రపోయేవాడు.


నియేకియ లేచి, యింట్లోనుండి బయటికి పోయింది. పోయేటప్పుడు ఆమె వాకిలి మూయడం మరచిపోయింది.


నైనస్ మళ్లీ కండ్లు తెరచి చూసేటప్పటికి బాగా ఉదయమైనట్లు వాకిలిగుండా కనిపించింది. నీలాకాశంలో యెలుగుబంటి సూర్యుని లాగుతూ వుండింది. నైనస్ యింట్లోనుండి బయటికి దూకి, తమ్ముళ్లను పిలిచినాడు. సూర్యుడు అతన్ని చూసి, తన వేడిని అతనిమీద వేసి, అతన్ని నేలమీద పడవేసినాడు. నియేకియ తన పెండ్లికొడుకు వద్దకు పరుగెత్తుకొనిపోయి, తన దేహంతో అతన్ని కప్పింది. నైనస్ లేచి,' నీడగా మారి, ఆకాశంలో కలిసిపోయినాడు.


సూర్యుడు నియేకియ జడలు పట్టుకొని,




తన మంట కన్నులతో ఆమెను కాల్చినాడు. అతను తన కొడుకు పెయ్‌వాల్కెను పిలవసాగినాడు. నియేకియ యేడుస్తూ, చెప్పింది: "నీవు నన్ను చంపినా సరే, పెయ్‌వాల్కెను పెండ్లిచేసుకోను!"
అప్పుడు సూర్యుడు కోపంతో ఆమెను











నేరుగా చంద్రుని చేతుల్లోకి
విసరివేసినాడు.
చంద్రుడు ఆమెను కౌగలించుకొని,
తన హృదయానికి హత్తుకున్నాడు.
అప్పటినుండి ఆమె చంద్రుని చేతుల్లో
అట్లే వుంది. చంద్రునిలో ఆమె
చిన్న ముఖం సీడ నీకు







కనిపిస్తుందా? ఆకాశంలో ఉత్తర కాంతుల అన్నదమ్ములు యుద్ధం చేసేచోట, సముద్రం దగ్గర కనిపించే వెలుగును నియేకియ చూస్తూనే వుంది. అక్కడినుండి ఆమె కన్నులు పక్కకు తిప్పుకోలేదు.



